సాక్షి
రాజన్న సిరిసిల్ల

ఆదివారం ♦ 21 ♦ జనవరి ♦ 2024



వేములవాడలో భక్తజనం

వేములవాడఅర్బన్: రాజన్న ఆలయంలో శనివారం భక్తుల రద్దీ కనిపించింది. ధర్మగుండంలో స్నానాలు చేసి కోడెమొక్కులు చెల్లించుకున్నారు.



ఇంటింటికి రాములోరి అక్షింతలు

గంభీరావుపేట(సిరిసిల్ల): గంభీరావుపేటలో శనివారం ఇంటింటికి అయోధ్య రాములోరి అక్షింతలు పంపిణీ చేశారు. 22న రామాలయంలో ప్రత్యేక పూజలు చేయనున్నారు.

వాతావరణం

గరిష్టం/కనిష్టం
29.0/19.0

ఆకాశం నిర్మలంగా ఉంటుంది. అప్పుడప్పుడు మేఘావృతమవుతుంది. గాలిలో తేమ అధికంగా ఉంటుంది. చలిగాలులు వీస్తాయి.







ఫ్లాష్‌మాబ్..

సిరిసిల్లటౌన్: రాజన్న సిరిసిల్ల జిల్లా మెడికల్ కళాశాల విద్యార్థుల శనివారం ఫ్లాష్‌మాబ్ నిర్వహించారు. మహిళలపై జరుగుతున్న అఘాయిత్యాలను అడ్డుకోవడమే ఈ ఫ్లాష్‌మాబ్ ఉద్దేశం. స్థానిక అంబేడ్కర్ చౌరస్తాలో ఎంబీబీఎస్ ఫస్టియర్ విద్యార్థులు నృత్యాలు చేసి మహిళలపై జరుగుతున్న ఆకృత్యాలపై ప్రజల్లో చర్చకు పెట్టారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ చంద్రశేఖర్, ప్రోగ్రాం డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ చీకోటి సంతోష్, డీసీహెచ్ఎస్ డాక్టర్ మురళీధర్‌రావు, ప్రొఫెసర్లు, వైద్యకళాశాల సిబ్బంది పాల్గొన్నారు.



పల్లెకో ప్రత్యేకత!

పోలీసుల బూట్ల చప్పులు.. నక్సలైట్ల పాటలతో తెల్లారిన పల్లెల్లో ఉద్యోగుల హడావుడి.. క్రీడాకారుల నెట్‌ప్రాక్టీస్‌లు కనిపిస్తున్నాయి. కల్లోల పల్లెలకు కేరాఫ్‌గా నిలిచిన ఉమ్మడి ఎల్లారెడ్డిపేట మండలంలోని ఆనాటి మారుమూల పల్లెల్లో నేడు విద్యాకుసుమాలకు నిలయాలుగా మారాయి. సమాజ అభివృద్ధిలో చదువు ప్రాముఖ్యతను గుర్తించిన పల్లెజనం ఉన్నత విద్యవైపు నడిచి అభివృద్ధిలో దూసుకెళ్తున్నారు. ఆనాడు కల్లోల పల్లెలుగా చర్చించుకున్న జనం నేడు అదే పల్లెల గురించి అభివృద్ధి మాటలు మాట్లాడుకోవడం అక్కడ జరిగిన మార్పునకు నిదర్శనం. – ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల)

- 8లో▸

న్యూస్‌రీల్

రూ.80కోట్ల బకాయిల వసూలుకు చర్యలు

- సెస్ చైర్మన్ చిక్కాల రామారావు



బాధిత కుటుంబానికి రూ.5లక్షల చెక్కు అందిస్తున్న చైర్మన్ రామారావు

ముస్తాబాద్(సిరిసిల్ల): వినియోగదారులు సహకరించినప్పుడే సెస్ మనుగడలో ఉంటుందని చైర్మన్ చిక్కాల రామారావు పేర్కొన్నారు. పోతుగల్‌లో ఇటీవల విద్యుదాఘాతంతో మృతిచెందిన శ్రీనివాస్ కుటుంబానికి సెస్ తరఫున రూ.5లక్షల పరిహారం చెక్కును శనివారం అందించి మాట్లాడారు. సహకార రంగంలో సెస్‌కు మంచి పేరు ఉందన్నారు. రూ.80కోట్ల వరకు బిల్లులు బకాయి ఉన్నాయని, వాటిని చెల్లించి సెస్ మనుగడకు సహకరించాలని కోరారు. సెస్ సిబ్బంది లేకుండా ట్రాన్స్‌ఫార్మర్లను ప్రైవేట్ వ్యక్తులు మరమ్మతు చేయొద్దని, ప్రమాదం జరిగితే సంస్థ బాధ్యత వహించబోదని స్పష్టం చేశారు. జెడ్పీటీసీ నర్సయ్య, సెస్ డైరెక్టర్ సందుపట్ల అంజిరెడ్డి, సింగిల్‌విండో చైర్మన్ తన్నీరు బాపురావు, ఏడీఈ మహేందర్, ఏఈ విష్ణుతేజ, మాజీ సర్పంచ్ ద్యావతి పండరి, తలారి నర్సింలు, ధర్మేందర్, జంగరాజు, నర్సింహారెడ్డి ఉన్నారు.


నవోదయకు 76 శాతం హాజరు



విద్యార్థులను తనిఖీ చేస్తున్న ఉపాధ్యాయులు

సిరిసిల్లఎడ్యుకేషన్: జవహర్ నవోదయ విద్యాలయంలో ఐదో తరగతిలో ప్రవేశానికి శనివారం నిర్వహించిన ప్రవేశ పరీక్షకు జిల్లాలో 76 శాతం మంది విద్యార్థులు హాజరైనట్లు జిల్లా విద్యాధికారి రమేశ్‌కుమార్ తెలిపారు. సిరిసిల్ల, వేములవాడలో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రాల్లో 985 మంది పరీక్ష రాయాల్సి ఉండగా 750 మంది హాజరైనట్లు వెల్లడించారు.

ఆలయాలు శుభ్రం



శివాలయంలో శుభ్రం చేస్తున్న బీజేపీ నేతలు

సిరిసిల్లటౌన్: ప్రధానమంత్రి నరేంద్రమోదీ పిలుపుతో సిరిసిల్లలోని శివాలయాలను బీజేపీ నేతలు శనివారం శుభ్రం చేశారు. ఈనెల 22న అయోధ్య రామమందిరంలో ప్రాణప్రతిష్ట నేపథ్యంలో అందరూ తమ సమీప ఆలయాలను శుభ్రం చేసి ప్రత్యేక పూజలు చేయాలని కోరారు. మున్సిపల్ మాజీ చైర్మన్ ఆడెపు రవీందర్, శీలం రాజు, బోగ వెంకన్న, మ్యాన రాంప్రసాద్, గజభీంకార్ చందు పాల్గొన్నారు.

సిరిసిల్లలో సీఐడీ తనిఖీల కలకలం

సిరిసిల్లక్రైం: నకిలీ సర్టిఫికెట్లు తయారు చేస్తున్న వ్యక్తిని సీఐడీ పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. గత రెండు రోజులుగా రాజన్నసిరిసిల్ల జిల్లా కేంద్రంలోని సాయినగర్‌లో సీఐడీ అధికారుల బృందం తనిఖీలు చేసినట్లు ప్రచారం జరిగింది. సాయిబాబా ఆలయ సమీపంలో వాహనాలు నిలిపి ఆ కాలనీలోనే ఉంటున్న వ్యక్తిని అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. సదరు వ్యక్తి దుబాయి, ఇతర గల్ఫ్ దేశాలకు వెళ్లే వారికి నకిలీ సర్టిఫికెట్లు తయారు చేసి ఇస్తున్నారనే సమాచారంతో దాడి చేసినట్లు తెలిసింది. సర్టిఫికెట్ల తయారీకి ఉపయోగించే కంప్యూటర్‌తోపాటు ఇతర సామగ్రిని సీఐడీ అధికారులు సీజ్‌చేసి తీసుకెళ్లినట్లు స్థానిక పోలీసుల ద్వారా తెలిసింది. ఆరుగురు అధికారులు వచ్చినట్లు సమాచారం. అదుపులోకి తీసుకున్న వ్యక్తి వివరాలు తెలియాల్సి ఉంది.

బాలరాముడిని చూసొద్దాం

అయోధ్యకు ప్రత్యేక రైళ్లు

- ఉమ్మడి జిల్లా మీదుగా పలు సర్వీసులు
- ఖాజీపేట, సికింద్రాబాద్, జాల్నా నుంచి ప్రారంభం
- 29 నుంచి బుకింగ్ షురూ..
- రైళ్ల సంఖ్య పెంచాలని కోరుతున్న భక్తులు



సాక్షిప్రతినిధి, కరీంనగర్: అయోధ్య రామాలయంలో రాముడి ప్రాణప్రతిష్టను పురస్కరించుకుని దేశంలోని నలుమూలల నుంచి భక్తులు తరలివెళ్లేందుకు సిద్ధమవుతున్నారు. ఈ తరుణంలో దక్షిణమధ్య రైల్వే ప్రత్యేక రైళ్లను నడిపేందుకు సిద్ధమైంది. అందులో పలు సర్వీసులు ఉమ్మడి జిల్లా భక్తులకు అందుబాటులోకి తీసుకొచ్చింది. మూడు ప్రత్యేక రైళ్లు ఉమ్మడి జిల్లాలోని పలు ప్రాంతాల మీదుగా అయోధ్య వెళ్లనున్నాయి. ఒకటి మహారాష్ట్ర నుంచి నిజామాబాద్–కరీంనగర్–పెద్దపల్లి ప్రాంతాల మీదుగా అయోధ్యకు వెళ్తుంది. మరో రెండు సర్వీసుల్లో ఒకటి సికింద్రాబాద్, మరోటి ఖాజీపేట నుంచి బయలుదేరి పెద్దపల్లి, రామగుండం మీదుగా అయోధ్య నగరాన్ని చేరుకుంటాయి. ఈనెల 29 నుంచి బుకింగ్ సదుపాయాన్ని అందుబాటులోకి తీసుకురానుంది. ఆధ్యాత్మిక ప్రాంతాల పర్యటనకు ఉద్దేశించిన ఈ ప్రత్యేక రైళ్లను ఆస్తా రైళ్లుగా పిలుస్తారు. ఇందులో 22 కోచ్‌లు ఉండగా 20 స్లీపర్ బోగీలు(రిజర్వుడు) రెండు మాత్రం సాధారణ బోగీలు ఉంటాయి.

కాజీపేట నుంచి..

రైలు నంబర్.. 07223 కాజీపేట జంక్షన్ నుంచి ఈనెల 30 నుంచి ఫిబ్రవరి 28 వరకు వారంలో మూడు రోజులు(మొత్తం 15 ట్రిప్పులు) నడుస్తాయి. జనవరి 30వ తేదీ, ఫిబ్రవరి 1, 3, 6, 8, 10, 12, 14, 16, 18, 20, 22, 24, 26, 28 తేదీలలో సాయంత్రం కాజీపేట జంక్షన్ నుంచి 06:20 నిమిషాలకు బయలుదేరుతుంది. పెద్దపల్లి జంక్షన్‌కు 7:38 గంటలకు, రామగుండం నుంచి 8:00 గంటలకు బయలుదేరి మరుసటి రోజు(ఒక రోజు ప్రయాణం తర్వాత) ఉదయం 3:35 గంటలకు అయోధ్య ధాం జంక్షన్‌కు చేరుకుంటుంది.

- ఇదే రైలు తిరుగు ప్రయాణంలో నంబర్.. 07224 ఫిబ్రవరి 2, 4, 6, 9, 11, 13, 15, 17, 19, 21, 23, 25, 27, 29, మార్చి 2వ తేదీన మొత్తం(15 ట్రిప్పులు) ఈ ప్రత్యేక రైళ్లు నడుస్తాయి. ఈ రైలు అయోధ్య ధాం జంక్షన్ నుంచి మధ్యాహ్నం 2:20 గంటలకు బయలుదేరి మరుసటి రోజు రాత్రి 9 గంటలకు కాజీపేట జంక్షన్‌కు చేరుకుంటుంది. ఈ రైళ్లు అయోధ్య ధాం జంక్షన్ నుంచి వచ్చేటప్పుడు రామగుండంకు సాయంత్రం 6:30 గంటలకు, పెద్దపల్లి జంక్షన్‌కు 7 గంటలకు చేరుకుంటాయి.

సికింద్రాబాద్ నుంచి..

రైలు నంబర్.. 07221 సికింద్రాబాద్ నుంచి అయోధ్య ధాం జంక్షన్ రైల్వేస్టేషన్‌కు ఈనెల 29 నుంచి ఫిబ్రవరి 29 వరకు వారంలో మూడు రోజులు (మొత్తం 16 ట్రిప్పులు) ఈ రైళ్లు నడుస్తాయి, జనవరి 29, 31 తేదీలు, ఫిబ్రవరి 2, 5, 7, 9, 11, 13, 15, 17, 19, 21, 23, 25, 27, 29 తేదీలలో సాయంత్రం 4:45 గంటలకు సికింద్రాబాద్ జంక్షన్‌లో బయలుదేరుతుంది. కాజీపేట జంక్షన్‌కు సాయంత్రం 6:20 గంటలకు, పెద్దపల్లి జంక్షన్‌కు 7:38, రామగుండం 8 గంటలకు బయలుదేరి మరుసటి రోజు(ఒక రోజు ప్రయాణం తర్వాత) ఉదయం 3:30 గంటలకు అయోధ్య చేరుకుంటాయి.

- ఇదే రైలు తిరుగు ప్రయాణంలో నంబర్.. 07222తో ఫిబ్రవరి 1, 3, 5, 8, 10, 12, 14, 16, 18, 20, 22, 24, 26, 28 ఇంకా మార్చి 1, 3 తేదీల్లో ఈ ప్రత్యేక రైళ్లు నడుస్తాయి, ఈ రైలు అయోధ్య ధామ్ జంక్షన్ నుంచి మధ్యాహ్నం 2:20 గంటలకు బయలుదేరి మరుసటి రోజు రాత్రి 10:30 గంటలకు సికింద్రాబాద్ జంక్షన్ చేరుకుంటుంది. ఈ రైళ్లు రామగుండంకు సాయంత్రం 6:30, పెద్దపల్లి జంక్షన్‌కు 7:00, కాజీపేట జంక్షన్‌కు 8:08 గంటలకు చేరుకుంటాయి.

జగిత్యాల-కరీంనగర్-పెద్దపల్లి మీదుగా

రైలు నంబర్.. 07649 జాల్నా నుంచి ఫిబ్రవరి 4న(ఆదివారం) ఉదయం 9:30 గంటలకు జాల్నా రైల్వేస్టేషన్ నుంచి బయలుదేరి కోరుట్ల సాయంత్రం 5:18 గంటలకు, లింగంపేట్ జగిత్యాల సాయంత్రం 5:50, కరీంనగర్ రైల్వేస్టేషన్ సాయంత్రం 6:45, పెద్దపల్లి జంక్షన్‌కు రాత్రి 7:35, రామగుండంకు రాత్రి 8:00, అయోధ్య మంగళవారం తెల్లవారుజామున 3:35 గంటలకు చేరుకుంటుంది.

- ఇదే రైలు తిరుగుప్రయాణంలో నంబర్.. 07650 ఫిబ్రవరి 6న బుధవారం మధ్యాహ్నం 2:20 గంటలకు అయోధ్య ధామ్ జంక్షన్ నుంచి బయలుదేరి రామగుండానికి గురువారం సాయంత్రం 7:25 గంటలకు, పెద్దపల్లి జంక్షన్‌కు 7:55, కరీంనగర్ రైల్వేస్టేషన్‌కు రాత్రి 8:35, లింగంపేట జగిత్యాల రైల్వేస్టేషన్‌కు 9:20, కోరుట్ల రైల్వేస్టేషన్‌కు రాత్రి 9:50 గంటలకు చేరుకుంటుంది.

రైళ్ల సంఖ్య పెంచాలి



జాల్నా నుంచి జగిత్యాల–కరీంనగర్–పెద్దపల్లి మీదుగా అయోధ్యకు ఒకటే రైలు వేశారు. వాస్తవానికి ఈ రైలుతో సిరిసిల్ల, జగిత్యాల, కరీంనగర్, పెద్దపల్లి మొత్తం నాలుగు జిల్లాల ప్రజలకు అయోధ్యకు వెళ్లే అవకాశం ఉంది. ఈ మార్గంలో మరిన్ని ప్రత్యేక రైళ్లు వేయాలి. అదే విధంగా కరీంనగర్‌లో జమ్మికుంటకు హాల్టింగ్ సదుపాయం కల్పిస్తే హన్మకొండ–కరీంనగర్ జిల్లా వాసులకు ఉపయుక్తంగా ఉంటుంది.

– ఫణి, సామాజిక ఉద్యమకారుడు

త్వరలో మర్రిపల్లి రిజర్వాయర్ పనులు

- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్



చెక్కపల్లిలో గోదాం ప్రారంభిస్తున్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

వేములవాడరూరల్: మర్రిపల్లి రిజర్వాయర్ పనులు త్వరలోనే ప్రారంభిస్తామని వేములవాడ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ పేర్కొన్నారు. వేములవాడరూరల్ మండలం మల్లారం, మర్రిపల్లి గ్రామాల్లో శనివారం నిర్వహించిన కృతజ్ఞతర్యాలీలో పాల్గొని మాట్లాడారు. మర్రిపల్లి రిజర్వాయర్ పనులను గత ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిందని, వెంటనే సంబంధితశాఖ అధికారులతో మాట్లాడి పనులు ప్రారంభమయ్యేలా చర్యలు తీసుకుంటానన్నారు. అభివృద్ధి పేరుతో రూ.6లక్షల కోట్లు అప్పులు చేసిన ఘనత నాటి పాలకులదని విమర్శించారు. ఇచ్చిన హామీలు అమలు చేయడమే కాంగ్రెస్ ప్రభుత్వ సిద్ధాంతమని స్పష్టం చేశారు. చెక్కపల్లిలో కో–ఆపరేటివ్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్మించిన నూతన గోదాంను ప్రారంభించారు. టిస్కాబ్ చైర్మన్ కొండూరు రవీందర్‌రావు, జెడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ, పీఏసీఎస్ చైర్మన్ ఏనుగు తిరుపతిరెడ్డి, ఎంపీపీ మల్లేశం, జెడ్పీటీసీ ఏశ వాణి, మాజీ ఎంపీపీ రంగు వెంకటేశ్, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు వకుళాభరణం శ్రీనివాస్, సర్పంచులు అడ్డిక జైపాల్‌రెడ్డి, సోయినేని కరుణాకర్ పాల్గొన్నారు.

బడీడు పిల్లలను స్కూల్‌లో చేర్పించాలి



సమావేశానికి హాజరైన అధికారులు

- వృద్ధులు భిక్షాటన చేయకుండా చూడాలి
- జిల్లా సంక్షేమాధికారి లక్ష్మీరాజం

వేములవాడఅర్బన్: బడీడు పిల్లలను స్కూల్‌లో చేర్పించాలని జిల్లా సంక్షేమాధికారి లక్ష్మీరాజం కోరారు. వేములవాడ రాజన్న ఆలయ ఓపెన్ స్లాబ్‌లో శనివారం మహిళా అభివృద్ధి, శిశు సంక్షేమం, దివ్యాంగుల సంక్షేమం, వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. రాజన్న ఆలయ పరిసరాలలో అనాథ పిల్లలు తిరుగుతుంటే వారిని వెంటనే పాఠశాలల్లో చేర్పించాలని సూచించారు. ఆలయం ముందు వృద్ధులు భిక్షాటన చేయకుండా చూడాలన్నారు. వృద్ధుల కోసం, ఒంటరి మహిళల కోసం ఎల్లారెడ్డిపేట, తంగళ్లపల్లి మండలం మండేపల్లిలో వృద్ధాశ్రమం ఉందని అందులో చేర్పించాలన్నారు. మహిళా సాధికారత కేంద్రం కో–ఆర్డినేటర్ రోజా మాట్లాడుతూ హింసకు గురైన మహిళలకు సఖీ కేంద్రం ఆధ్వర్యంలో కౌన్సిలింగ్, న్యాయం, వైద్య సహాయంతోపాటు తాత్కాలిక వసతి కల్పిస్తున్నట్లు వివరించారు. ఆపదలో ఉన్న మహిళలు టోల్‌ఫ్రీ నంబర్ 181కి కాల్ చేయాలని కోరారు. ఆర్డీవో మధుసూదన్, వేములవాడటౌన్ సీఐ కరుణాకర్, సీడీపీవో ఎల్లయ్య, ఈఈ రాజేశ్, డీఈ రఘునందన్, ఏఈవోలు హరికృష్ణ, జయకుమార్, ప్రతాప నవీన్ తదితరులు ఉన్నారు.

జాతీయస్థాయి పోటీలకు ఎంపిక



క్రీడాకారులకు సాయం అందిస్తున్న పీఏసీఎస్ చైర్మన్ కృష్ణారెడ్డి

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): మండలంలోని రాచర్లగొల్లపల్లిలోని రాచర్లజూనియర్ కళాశాలకు చెందిన విద్యార్థులు కోల అక్షిత, స్వప్నిక్, హరిచంద్ర ప్రసాద్ జాతీయస్థాయి క్రీడలకు ఎంపికయ్యారు. ఈనెల 24 నుంచి 28 వరకు ఝార్ఖండ్ రాష్ట్రంలోని రాంచీలో జరిగే పోటీల్లో పాల్గొంటారని పీఈటీ విక్రమ్ తెలిపారు. జాతీయ స్థాయికి ఎంపికైన క్రీడాకారులకు సింగిల్‌విండో చైర్మన్ గుండారపు కృష్ణారెడ్డి శనివారం తన వంతుగా రూ.5వేలు ఆర్థికంగా సాయం అందించారు. ఈ కార్యక్రమంలో నాయకులు అందె సుభాష్, పీఈటీ విక్రం, కళాశాల డైరెక్టర్ ఏలూరి రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

యువత ఓటు నమోదు చేసుకోవాలి

- జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ అనురాగ్ జయంతి



వివరాలు తెలుసుకుంటున్న కలెక్టర్

కోనరావుపేట(సిరిసిల్ల): అర్హులైన యువత ఓటు హక్కు నమోదు చేసుకోవాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ అనురాగ్ జయంతి పేర్కొన్నారు. ప్రత్యేక ఓటరు సంక్షిప్త, పునరీక్షణలో భాగంగా మండలంలోని నిజామాబాద్ జెడ్పీ హైస్కూల్, కమ్మరిపేటలోని పోలింగ్ బూత్‌లలో ఓటింగ్ నమోదును శనివారం పరిశీలించారు. అదే ఆవరణలోని ప్రాథమిక పాఠశాలను సందర్శించి సౌకర్యాలపై ఆరా తీశారు. విద్యార్థుల సంఖ్య, హాజరు శాతం తెలుసుకున్నారు. జనవరి 1వ తేదీ నాటికి 18ఏళ్లు నిండిన యువత తమ పేర్లను నమోదు చేసుకోవాలని సూచించారు. బూత్ లెవల్ అధికారులు కేటాయించిన పోలింగ్ కేంద్రాల్లో అందుబాటులో ఉండాలన్నారు. తహసీల్దార్ విజయ ప్రకాశ్‌రావు ఉన్నారు.

నెలాఖరుకు సీఎమ్మార్ పూర్తి చేయాలి

- అడిషనల్ కలెక్టర్ ఖీమ్యానాయక్



రైస్‌మిల్లు తనిఖీ చేస్తున్న అడిషనల్ కలెక్టర్

సిరిసిల్లటౌన్/వేములవాడఅర్బన్/కోనరావుపేట(వేములవాడ): ఈనెలాఖరు వరకు సీఎమ్మార్ పూర్తి చేయాలని అడిషనల్ కలెక్టర్ ఖీమ్యానాయక్ రైస్‌మిల్లర్లను ఆదేశించారు. జిల్లాలోని సిరిసిల్ల, వేములవాడ, కోనరావుపేట మండలం కొలనూరులోని రైస్‌మిల్లులను శనివారం తనిఖీ చేసి మాట్లాడారు. ఎఫ్‌సీఐకి మిల్లర్లు పంపించాల్సిన బియ్యం నిర్దేశిత గడువులోగా అందజేయాలని సూచించారు. రోజువారీ లక్ష్యంతో బియ్యం సరఫరా ప్రక్రియ పూర్తి చేయాలన్నారు. డీఎస్‌వో జితేందర్‌రెడ్డి, మేనేజర్ జితేంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించండి



మున్సిపల్ ఆఫీస్ ఎదుట ధర్నా చేస్తున్న కార్మికులు

సిరిసిల్లటౌన్: గ్రీనరీ, పారిశుధ్య కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు మూశం రమేశ్ డిమాండ్ చేశారు. డివైడర్లు, పార్కుల్లో పనిచేసే కార్మికులు, పారిశుధ్య నిర్వహణ కార్మికులతో కలిసి ధర్నాలు చేపట్టి, మాట్లాడారు. గ్రీనరీ కార్మికుల కాంట్రాక్టు గడువు డిసెంబర్‌తో ముగిసిందని, ఐదు నెలల వేతనాలు ఇవ్వలేదన్నారు. ఈవిషయమై కలెక్టర్‌కు కూడా వినతిపత్రం ఇచ్చినా స్పందన లేదని ఆవేదన వ్యక్తం చేశారు.

శానిటేషన్ కార్మికులు సమ్మెకు సిద్ధం

ఈనెల 22 నుంచి మున్సిపల్ పారిశుధ్య కార్మికులు నిరవధిక సమ్మె చేపడుతున్నట్లు మూశం రమేష్ పేర్కొన్నారు. సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మున్సిపల్ ఆఫీస్ ఎదుట శనివారం ధర్నా చేపట్టి మాట్లాడారు. పదేళ్లుగా పెండింగ్‌లో ఉంటున్న పీఎఫ్ డబ్బులు ఇవ్వాలని కోరారు. సమ్మె నోటీస్ ఇచ్చినా అధికారులు పట్టించుకోలేదన్నారు. కోడం రమణ, సుల్తాన్ చంద్రయ్య, నర్సయ్య, శారద, రమణమ్మ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

రాష్ట్రస్థాయికి ఎంపికైన ప్రదర్శన



ఎంపికైన ప్రదర్శనతో విద్యార్థిని

చొప్పదండి: మండలంలోని రుక్మాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన పిరిశెట్టి హర్షవల్లిక జిల్లాస్థాయి వర్చువల్ విజ్ఞానశాస్త్ర మేళాలో పాల్గొంది. విద్యార్థిని ప్రతిభ కనబరచడంతో తన ప్రదర్శన రాష్ట్రస్థాయికి ఎంపికైంది. ఆమె రూపొందించిన స్మార్ట్ రోటీ మేకర్ యూజింగ్ సోలార్ ఎనర్జీ అనే ఎగ్జిబిట్ జిల్లాస్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచినట్లు ప్రధానోపాధ్యాయుడు బి.రఘుకిషోర్ తెలిపారు. జిల్లాస్థాయిలో 262 ప్రదర్శనలు పాల్గొనగా, తమ పాఠశాలకు ప్రథమస్థానం రావడంపై సైన్స్ ఉపాధ్యాయురాలు గట్టు శ్రీవాణిని అభినందించారు.

జాతీయ ఆర్ట్స్ పోటీల్లో రాణించిన విద్యార్థులు



పతకాలు సాధించిన విద్యార్థులు

గంగాధర: రంగోత్సవ్ సెలబ్రేషన్‌వారు జాతీయస్థాయిలో నిర్వహించిన ఆర్ట్‌పోటీల్లో గంగాధర ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచి పతకాలు సాధించారు. పాఠశాల నుంచి 54మంది విద్యార్థులు పోటీలో పాల్గొన్నారు. పదిమంది గోల్డ్ మెడల్స్, ఇద్దరు బ్రాంజ్‌మెడల్స్ సాధించారు. మిగితావారు ప్రతిభా సర్టిఫికెట్లు పొందారు. విద్యార్థులను ప్రధానోపాధ్యాయురాలు గూడూరి అనితాకుమారి, ఆర్ట్ టీచర్ రామానుజాచారి, ఉపాధ్యాయులు అభినందించారు.

గ్రూప్స్ శిక్షణకు గడువు పొడిగింపు

సప్తగిరికాలనీ(కరీంనగర్): కరీంనగర్‌లోని బీసీ స్టడీసర్కిల్‌లో గ్రూప్–1,2,3,4 ఫౌండేషన్ కోర్సుకు ఉచిత శిక్షణ దరఖాస్తులకు ఈ నెల 24వరకు గడువు పొడిగించినట్లు స్టడీ సర్కిల్ డైరెక్టర్ డాక్టర్ రవి కుమార్ తెలిపారు. అభ్యర్థులు వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. డిగ్రీ అర్హత కలిగిన ఉమ్మడి కరీంనగర్, పెద్దపల్లి, జగిత్యాల జిల్లాలకు చెందిన నిరుద్యోగ యువతీ, యువకులు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. అభ్యర్థుల కుటుంబ వార్షిక ఆదాయం రూ.5లక్షలకు మించరాదని, దరఖాస్తుతో పాటు ఎస్సెస్సీ, ఇంటర్, డిగ్రీ, ప్రస్తుత కుల, ఆదాయ ధ్రువపత్రాలు, ఆధార్, ఫొటోను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాల్సి ఉంటుందని, అభ్యర్థుల ఎంపిక రిజర్వేషన్, డిగ్రీలో వచ్చిన మార్కుల ఆధారంగా ఉంటుందని తెలిపారు. పూర్తి వివరాలకు 0878–2268686 నంబరును సంప్రదించాలని సూచించారు.

16వేల బియ్యపు గింజలతో అయోధ్య రామమందిరం

- జగిత్యాల కళాకారుడి అద్భుత ప్రతిభ

జగిత్యాలటౌన్: బియ్యపు గింజలతో అయోధ్య రామమందిరం నిర్మాణాన్ని రూపొందించి ఔరా అనిపించారు జగిత్యాల జిల్లాకు చెందిన గుర్రం దయాకర్. ఈనెల 22న అయోధ్యలో రామమందిర ప్రారంభోత్సవాన్ని పురస్కరించుకుని పట్టణానికి చెందిన సూక్ష్మకళాకారుడు దయాకర్ 16వేల బియ్యపు గింజలతో 60 గంటలపాటు శ్రమించి 5 ఇంచుల వైశాల్యంతో అరచేతిలో ఇమిడేలా రామమందిరం నమూనాను తయారు చేశారు. ఇప్పటివరకు బియ్యపు గింజలతో ఆలయ నిర్మాణం ఎవరూ తయారు చేయలేదని, ఈ కళాఖండాన్ని ప్రధాని మోదీకి బహుమతిగా ఇవ్వడమే తన సంకల్పమని తెలిపారు. గతంలో ఎన్నో సూక్ష్మ కళారూపాలను తయారు చేసి పలువురి మన్ననలు పొందిన దయాకర్ గిన్నీస్ బుక్‌లో చోటు సాధించడం విశేషం.



రామాలయం రూపకల్పనలో గుర్రం దయాకర్



రూపొందించిన అయోధ్య రామమందిరం

10 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత

తంగళ్లపల్లి(సిరిసిల్ల): అక్రమంగా తరలిస్తున్న పీడీఎస్(రేషన్) బియ్యాన్ని శుక్రవారం అర్ధరాత్రి సీజ్ చేసినట్లు ఇల్లంతకుంట ఎస్సై డి.సుధాకర్ తెలిపారు. మండల కేంద్రంలో శనివారం పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా కోనరావుపేట మండలం బావుసాయిపేటకు చెందిన టేకుమట్ల కుమార్ ట్రాలీ ఆటోలో తరలిస్తున్న పీడీఎస్ బియ్యాన్ని సీజ్ చేశామన్నారు. 25 బస్తాల్లో 10 క్వింటాళ్ల రేషన్ బియ్యం ఉన్నట్లు పేర్కొన్నారు. బియ్యాన్ని సీజ్‌చేసి కేసు నమోదు చేసినట్లు తెలిపారు. తనిఖీల్లో పోలీస్ సిబ్బంది శ్రీనివాస్, తిరుపతి, శ్రీకాంత్ పాల్గొన్నారు.



సీజ్ చేసిన రేషన్ బియ్యంతో ఎస్సై సుధాకర్

పత్రాలు లేని వాహనాలు సీజ్

తంగళ్లపల్లి(సిరిసిల్ల): తంగళ్లపల్లిలో సరైన ధ్రువీకరణపత్రాలు లేని రెండు ట్రాక్టర్ ట్రాలీలు, ఒక గూడ్స్ వాహనాన్ని శనివారం సీజ్ చేసినట్లు ఎంవీఐ కిశోర్ చంద్రారెడ్డి తెలిపారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇసుక, సరుకులు రవాణా చేసే అన్ని వాహనాలు సరైన పత్రాలు తప్పనిసరిగా కలిగి ఉండాలని సూచించారు. సీజ్ చేసిన వాహనాలను తంగళ్లపల్లి పోలీస్ స్టేషన్‌కు తరలించినట్లు పేర్కొన్నారు.



ఆర్టీఏ అధికారులు సీజ్‌చేసిన వాహనాలు

పెద్దమ్మ ఆలయంలో చోరీ

ముస్తాబాద్: మండలంలోని మద్దికుంటలో పెద్దమ్మ ఆలయంలో శుక్రవారం రాత్రి చోరీ జరిగింది. గ్రామ శివారులోని పెద్దమ్మ ఆలయంలోని అమ్మవారి పుస్తెమెట్టెలు, పట్టుచీరతోపాటు హుండీలోని డబ్బులను ఎత్తుకెళ్లారు. చీకోడు, మద్దికుంట ఆలయాల్లో వరుస చోరీలతో గ్రామస్తులు ఆందోళనకు గురవుతున్నారు. పోలీసులు ఆలయాన్ని పరిశీలించి దర్యాప్తు చేస్తున్నారు.

ఐదు ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

ముస్తాబాద్ మానేరు వాగు నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న ఐదు ట్రాక్టర్లను పట్టుకున్నామని ఎస్సై శేఖర్ తెలిపారు. నిబంధనలకు విరుద్ధంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్లను సీజ్ చేసినట్లు పేర్కొన్నారు.

విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ చోరీ



ట్రాన్స్‌ఫార్మర్ పరిశీలిస్తున్న అధికారులు, రైతులు

ఎలిగేడు(పెద్దపల్లి): మండల కేంద్రంలోని ఎస్ఎస్–40, 25కేవీఏ సుల్తాన్‌పూర్ ఫీడర్‌కు సంబంధించిన వ్యవసాయ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను శుక్రవారం రాత్రి దొంగలు ధ్వంసం చేశారు. విద్యుత్ సరఫరా నిలిపివేసి ట్రాన్స్‌ఫార్మర్ ధ్వంసం చేసి అందులోని కాపర్‌వైర్ ఎత్తుకెళ్లినట్లు ఏఈ సంపత్‌కుమార్, లైన్ ఇన్‌స్పెక్టర్ మహిపాల్ శనివారం తెలిపారు. చోరీకి గురైన కాపర్‌వైర్ విలువ దాదాపు రూ.70వేల వరకు ఉంటుందన్నారు. ఈ విషయమై పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేయనున్నట్లు పేర్కొన్నారు. కాగా గతనెలలో ర్యాకల్‌దేవుపల్లిలో రెండు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు చోరీకి గురయ్యాయి.

యువకుడి ఆత్మహత్య

యైటింక్లయిన్‌కాలనీ(రామగుండం): రామగిరి మండలం చందనాపూర్ సింగరెడ్డిపల్లి గ్రామానికి చెందిన మేస్త్రీజూల సతీశ్(35) శనివారం ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. గోదావరిఖని టూటౌన్ పోలీసుల కథనం ప్రకారం.. సతీశ్ కొంతకాలంగా నిత్యం మద్యం తాగుతున్నాడు. ఈక్రమంలో 4నెలలుగా కడుపునొప్పితో బాధపడుతున్నాడు. గోదావరిఖని ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో చూపించుకోగా.. పరిక్షించిన వైద్యులు.. మద్యం తాగొద్దని సూచించారు. అయినా, వినకుండా మద్యం సతీశ్ మద్యం తాగుతూనే ఉన్నాడు. ఈక్రమంలో అతడి భార్య సుమలత తన ఇద్దరు పిల్లలతో కలిసి సంక్రాంతి పండుగ కోసం తన పుట్టింటికి వెళ్లింది. దీంతో శుక్రవారం రాత్రి తనకు కడుపునొప్పి వస్తోందని భార్యకు ఫోన్‌చేసి సమాచారం ఇచ్చాడు. ఆ తర్వాత శనివారం ఉదయం ఇంటి ఎదుట ఆవరణలోని రేకుల షెడ్డుకు ఉరేసుకొని చనిపోయాడు. మృతుడి భార్య సుమలత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు టూటౌన్ సీఐ వేణుగోపాల్ తెలిపారు.



సతీశ్(ఫైల్)

ఆర్థిక ఇబ్బందులు తాళలేక ఆత్మహత్య

పాలకుర్తి(రామగుండం): పాలకుర్తి మండలం ఈసాలతక్కళ్లపల్లికి చెందిన ఓడ్నాల ప్రభాకర్ శనివారం ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. స్థానికుల కథనం ప్రకారం.. ఓడ్నాల కిష్టస్వామికి ముగ్గురు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. రెండో కుమారుడు ప్రభాకర్ లారీ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ప్రభాకర్ భార్య లావణ్యతోపాటు కూతురు రక్షిత సంక్రాంతి పండుగ నేపథ్యంలో తమ పుట్టింటికి వెళ్లారు. కొంతకాలంగా ఆర్థిక ఇబ్బందులతో బాధపడుతున్న ప్రభాకర్.. శుక్రవారం రాత్రి భోజనం చేసి తన గదిలో పడుకున్నాడు. తెల్లవారుజామున తండ్రి కిష్టస్వామి వెళ్లి చూసేసరికి ప్రభాకర్ ఇంటి పైకప్పు ఇనుపపైపుకు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుని కనిపించాడు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు బసంత్‌నగర్ పోలీసులు సంఘటనా స్థలాన్ని సందర్శించి కేసు నమోదు చేసుకున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పెద్దపల్లి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

రాగినేడులో హుండీ చోరీ

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి మండలం రాగినేడు గ్రామంలోని శివాలయంలో శనివారం హుండీ చోరీ జరిగింది. అందులోని నగదును అపహరించుకెళ్లినట్టు గ్రామస్తులు తెలిపారు. ఆలయానికి వెళ్లిన భక్తులు హుండీ చోరీ అయినట్లు గుర్తించి ఆలయ కమిటీ, గ్రామ ప్రజాప్రతినిధులకు సమాచారం అందించారు.

అదృశ్యమైన వ్యక్తి వరదకాలువలో శవమై..

కోరుట్ల: పట్టణంలోని అల్లమయ్యగుట్ట ప్రాంతానికి చెందిన ఈర్నాల శ్రీనివాస్ (43) ఈనెల 18న ఇంట్లోనుంచి వెళ్లి మెట్‌పల్లి మండలం రాజేశ్వర్‌రావుపేట శివారు వరదకాలువలో శవమై కనిపించాడు. ఇంట్లో నుంచి వెళ్లిన శ్రీనివాస్ మరుసటిరోజు కూడా రాకపోవడం, ఫోన్ అందుబాటులోకి రాకపోవడంతో కుటుంబసభ్యులు ఈనెల 19న కోరుట్ల పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ క్రమంలో వరదకాలువలో గుర్తుతెలియని శవం ఉందని గ్రామస్తులు ఇబ్రహీంపట్నం పోలీసులకు ఫిర్యాదు రావడంతో అక్కడి పోలీసులు శవాన్ని పరిశీలించి శ్రీనివాస్‌గా గుర్తించారు. శ్రీనివాస్ భార్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు కోరుట్ల ఎస్సై కిరణ్‌కుమార్ తెలిపారు.



శ్రీనివాస్ మృతదేహం

బుగ్గారం సర్పంచ్ సస్పెన్షన్

బుగ్గారం: పంచాయతీ నిధుల వినియోగంలో ఆరోపణలు ఎదుర్కొంటున్న బుగ్గారం సర్పంచ్ మూల సుమలతను సస్పెండ్ చేస్తూ కలెక్టర్ యాస్మిన్ బాషా శనివారం ఉత్తర్వులు వెలువరించారు. అధికార దుర్వినియోగానికి పాల్పడడమే కాకుండా నోటీసులకు సరైన సంజాయిషీ కూడా ఇవ్వలేదని, దీంతో పంచాయతీరాజ్ చట్టం 2018లోని సెక్షన్ 37(5) ప్రకారం ఆమెను సస్పెండ్ చేస్తున్నామని పేర్కొన్నారు.

ఏళ్లుగా వీడీసీ పోరాటం

బుగ్గారం పంచాయతీలో అవినీతి, అధికార దుర్వినియోగం జరిగిందని ఆరోపిస్తూ గ్రామాభివృద్ధి కమిటీ ఏళ్ల తరబడి న్యాయపోరాటం చేస్తోంది. కమిటీ అధ్యక్షుడు చుక్క గంగారెడ్డి ఆధ్వర్యంలో సమాచార హక్కు చట్టం ద్వారా అన్ని పత్రాలు సేకరించి ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. పలుసార్లు విచారణ కూడా కొనసాగింది. కొంత సొమ్మును రికవరీ కూడా చేశారు. అవినీతిపరులను కాపాడుతున్నారని, ఉన్నతాధికారులు కూడా వత్తాసు పలుకుతున్నారని వీడీసీ సభ్యులు లోకాయుక్తకు ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో అనేక విచారణల అనంతరం అవినీతి, అధికార దుర్వినియోగం జరిగిందని గుర్తించి సర్పంచ్‌ను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. చుక్క గంగారెడ్డి మాట్లాడుతూ మండలంలోని మరిన్ని గ్రామాల్లో అవినీతి చోటుచేసుకుందని, పూర్తిస్థాయి సమాచారం సేకరించి న్యాయపోరాటం చేస్తామని వెల్లడించారు.

పాముకాటుతో వృద్ధురాలి మృతి

శంకరపట్నం: కన్నాపూర్ గ్రామానికి చెందిన ఓ వృద్ధురాలు పాముకాటుకు గురై మృతిచెందింది. చింతిరెడ్డి లక్ష్మి(65) శనివారం ఇంటి ముందున్న కూరగాయల తోటలో కూరగాయలు తెంపుతుండగా పాముకాటుకు గురైంది. భర్త, బంధువులు గమనించి కరీంనగర్ హాస్పిటల్‌కు తరలించే క్రమంలో మృతిచెందింది.



లక్ష్మి(ఫైల్)

అప్పులబాధతో యువకుడి ఆత్మహత్య

వీర్నపల్లి(సిరిసిల్ల): ఆర్థిక ఇబ్బందులతో గడ్డిమందు తాగిన యువకుడు చికిత్స పొందుతూ మృతిచెందిన సంఘటన వీర్నపల్లిలో విషాదం నింపింది. ఎస్సై రమేశ్ తెలిపిన వివరాలు. వీర్నపల్లి మండల కేంద్రానికి చెందిన దివ్యాంగుడు జక్కుల లింబాద్రి(36) కూరగాయలు విక్రయిస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఈక్రమంలో అప్పులపాలయ్యాడు. ఆర్థిక ఇబ్బందులు తట్టుకోలేక గడ్డిమందు తాగాగా.. కుటుంబ సభ్యులు ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ శనివారం మృతిచెందాడు. మృతుడికి భార్య సరిత, ముగ్గురు ఆడపిల్లలు ఉన్నారు.



లింబాద్రి(ఫైల్)

మెడికోస్ ఫ్రెషర్స్ హంగామా



సిరిసిల్ల: రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రభుత్వ మెడికల్ కాలేజీలో శనివారం ఫ్రెషర్స్ డే వేడుకలు నిర్వహించారు. స్థానిక కళ్యాణలక్ష్మి ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా జెడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ, మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళ హాజరయ్యారు. మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ చంద్రశేఖర్, డీఎస్‌హెచ్‌ఎస్ డాక్టర్ మురళీధర్‌రావు, డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ సంతోష్, కౌన్సిలర్లు గుండ్లపెల్లి నీరజ, చెన్నమనేని కీర్తి, లింగంపల్లి సత్యనారాయణ పాల్గొన్నారు.

‘శ్రీరాం’ఆకృతిలో విద్యార్థులు



శ్రీరాం ఆకృతిలో విద్యార్థులు

సప్తగిరికాలనీ(కరీంనగర్): అయోధ్యలో శ్రీరాముని విగ్రహం ప్రాణ ప్రతిష్ట నేపథ్యంలో కరీంనగర్‌లోని మానేరు విద్యాసంస్థల విద్యార్థులు శనివారం పాఠశాల ఆవరణలో వినూత్న తరహాలో ప్రదర్శన ఇచ్చారు. శ్రీరామ మందిరానికి సంకేతంగా 600మంది విద్యార్థులు శ్రీరామ ఆకృతిని ప్రదర్శించారు. జాతీయ జెండాలతో రామ బాణాన్ని ప్రదర్శించి ఔరా అనిపించారు. మానేరు విద్యాసంస్థల అధినేత కడారి అనంతరెడ్డి మాట్లాడుతూ శ్రీరాముని విశిష్ఠతను ప్రతి ఒక్కరు తెలుసుకోవాలన్నారు. పాఠశాలల డైరెక్టర్ కడారి సునీతారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రాజన్న భక్తులకు ఆదివారం నిరంతర దర్శనం

వేములవాడఅర్బన్: దక్షిణకాశీగా ప్రసిద్ధి చెందిన రాజన్న ఆలయంలో భక్తులకు ఆదివారం నిరంతరం దర్శన అవకాశం కల్పిస్తున్నట్లు ఆలయ ఈవో కృష్ణప్రసాద్ తెలిపారు. మేడారం సమ్మక్క–సారలమ్మ జాతర భక్తులు అధికంగా తరలివస్తుండడంతో ఆలయంలో రద్దీ పెరిగినందున ఈ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొన్నారు. మేడారం జాతర ముగిసే వరకు ప్రతీ ఆదివారం నిరంతరం దర్శనం అవకాశం ఉంటుందని వివరించారు.

పల్లెకో ప్రత్యేకత

- ఉద్యోగుల పల్లె గర్జనపల్లి
- చదువులతల్లి నారాయణపూర్
- క్రీడల వేదిక దుమాల, వీర్నపల్లి
- యువతకు స్ఫూర్తిగా నిలుస్తున్న పాతతరం
- నాటి కల్లోల పల్లెలు.. నేటి ఆదర్శ గ్రామాలు

ఇది వీర్నపల్లి మండలంలోని గర్జనపల్లి. ఒకప్పటి కల్లోల పల్లెగా ముద్రపడ్డ ఈ ఊరు నేడు ఉద్యోగులతో కళకళలాడుతోంది. 600 గడప ఉన్న ఈ పల్లెలో వివిధ శాఖల్లో 235 మంది ఉద్యోగులు ఉన్నారు. దాదాపు ఇరవై ఏళ్ల క్రితం ఆ ఊరు పేరు వింటేనే అలజడి. కానీ నేడు అభివృద్ధికి నిలువెత్తు నిదర్శనం. ఆర్టీసీ నుంచి మొదలైన ఉద్యోగాలపర్వం పోలీస్, సెస్, ఎక్సైజ్, హెల్త్ డిపార్ట్‌మెంట్లతోపాటు ఉపాధ్యాయులు, ఇంజినీర్లుగా స్థిరపడ్డ వారు ఉన్నారు.



గర్జనపల్లి

సండే స్పెషల్



దుమాలలోని క్రీడాకారులు

వాలీబాల్ ఆడుతున్న వీరు ఎల్లారెడ్డిపేట మండలం దుమాలకు చెందిన క్రీడాకారులు. ఒకప్పుడు ఆ పల్లె పేరింటేనే అందరూ జంకేవారు. సాయంత్రం అయిందంటే పోలీసుల బూట్ల చప్పుళ్లు, నక్సలైట్ల పాటలతో మారుమోగేది. అలాంటి పల్లె నేడు రాష్ట్రస్థాయి క్రీడాకారులకు వేదికైంది. నక్సల్స్ అమరవీరుల స్థూపం సాక్షిగా వాలీబాల్ కోర్టును ఏర్పాటు చేసుకొని ప్రాక్టీస్ చేస్తున్నారు. గత ముప్పై ఏళ్లుగా వివిధ క్రీడాపోటీల్లో జిల్లా, రాష్ట్రస్థాయిల్లో సత్తాచాటుతున్నారు. వాలీబాల్ క్రీడకు కేరాఫ్‌గా దుమాల మారింది. పదేళ్ల క్రితం ఎంప్లాయీస్ అసోసియేషన్ ఏర్పాటు చేసుకొని క్రీడాకారులను, విద్యార్థులను ఉన్నత స్థాయిలో నిలబెట్టేందుకు వారి వంతుగా ప్రోత్సాహం అందిస్తున్నారు.

ఇది ఎల్లారెడ్డిపేట మండలంలోని నారాయణపూర్. ఈ ఊరిలో ప్రతీ ఇంట్లో బీఈడీ, పీజీలు, ఇంజినీరింగ్ చదివిన పిల్లలు కనిపిస్తారు. ఒకప్పటి ఐఏఎస్ రమణాచారి, కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత, బహుభాష కోవిదుడు నలిమెల భాస్కర్‌లను స్ఫూర్తిగా తీసుకొని ఈతరం ఉన్నత చదువులతో ఉద్యోగాలు సాధిస్తున్నారు. ఇప్పటికే గ్రామంలో టీచర్లు 30 మంది, ఎంబీబీఎస్ వైద్యులు ఆరుగురు, సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లు 20, పాత్రికేయరంగంలో 8 మంది, ఉన్నత చదువులు చదివి విదేశాల్లో ఉన్నతంగా స్థిరపడ్డ వారు 30 మంది వరకు ఉన్నారు. ప్రభుత్వం నుంచి ఏ ఉద్యోగ నోటిఫికేషన్ వెలువడ్డ అందులో ఉద్యోగం సాధించిన వారు నారాయణపూర్ నుంచి ఒక్కరైనా ఉంటారు.



నారాయణపూర్ గ్రామం

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): నక్సలైట్ ప్రాబల్యం ఉన్న ఆ గిరిజన పల్లెల్లోకి కనీస సౌకర్యాలు రాలేవు. రోడ్లు లేక బస్సులు రాక ఆ పల్లె జనానికి కాలిబాటే దిక్కయ్యింది. అలాంటి పరిస్థితుల్లో మైళ్ల దూరంలో ఉన్న ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని ఎస్టీ హాస్టల్‌లో ఉంటూ పెద్దబడిలో చదువుకున్నారు. సమీపంలోని అన్ని గ్రామాలకు మండల కేంద్రంలోని పెద్దబడే పెద్దదిక్కు. అన్నీ కష్టాలను ఎదుర్కొన్న వారు డిగ్రీలు చదివి ఉద్యోగాలు సాధించి నేటి యువతకు ఆదర్శంగా నిలిచారు. ఎలాంటి క్రీడామైదానాలు, ఇతరత్ర సౌకర్యాలు లేని దుమాల, వీర్నపల్లి లాంటి కుగ్రామాల్లోని యువత అవకాశాలను సద్వినియోగం చేసుకొని నిత్యం సాధన చేస్తూ వివిధ క్రీడల్లో జిల్లా, రాష్ట్రస్థాయిలో రాణించి ఆ పల్లెల్లోని నేటితరానికి స్ఫూర్తిగా నిలిచారు. ఇంతటి కఠిన పరిస్థితులను ఎదుర్కొని చదువుకున్న వారు నేడు జిల్లా స్థాయి అధికారులుగా ఎదిగారు. ఇటీవల సీఎం పీఆర్వోగా నియమితులైన నారాయణపూర్‌కు చెందిన బొల్గం శ్రీనివాస్‌గౌడ్, కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత నలిమెల భాస్కర్, జిల్లా సైన్స్ అధికారి పాముల దేవయ్య, జిల్లా క్రీడాధికారి అజ్మీర రాందాస్, ఉస్మానియా యూనివర్సిటీ రిటైర్డ్ ప్రొఫెసర్ బద్దిపడిగే శివారెడ్డి లాంటి వారు నేటి యువతకు ఆదర్శంగా నిలుస్తున్నారు.

ఈ మట్టిలోనే ప్రత్యేకత ఉంది



మానేరువాగు పరివాహక గ్రామాల్లోని మట్టిలోనే ఏదో ప్రత్యేకత ఉంది. ఇక్కడి విద్యార్థులు, యువతలో సాధించాలనే పట్టుదల, కసి ఉంటుంది. ఈ ప్రాంతంలో ఆర్థిక పరిస్థితులు సైతం వారిని ఉన్నత చదువుల వైపు మళ్లేలా చేస్తుంది. ఒక్కరు కాదు.. ఇద్దరు కాదు పదుల సంఖ్యలో వివిధ రంగాల్లో రాణించారు. వారిని ఇప్పటి విద్యార్థులు స్ఫూర్తిగా తీసుకొని ముందుకుసాగాలి.

– నలిమెల భాస్కర్, కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత

పల్లె బిడ్డలు రాష్ట్రస్థాయికి..



ఎల్లారెడ్డిపేట, వీర్నపల్లి మండలాల్లోని పల్లె విద్యార్థులు వివిధ క్రీడల్లో ప్రతిభ చాటుతున్నారు. దుమాలలో చాలా మంది క్రీడాకారులు వాలీబాల్‌లో రాష్ట్ర, జాతీయస్థాయికి ఎదిగారు. జిల్లాలోనే ఈ ప్రాంత క్రీడాకారులు ఆటల్లో ప్రతిభ చూపుతూ గుర్తింపును తెచ్చుకుంటున్నారు. ఎలాంటి ఆర్థిక ప్రోత్సాహం లేకున్నా పట్టుదలతో ముందుకెళ్తున్నారు. ఎన్ని ఇబ్బందులు ఎదురైనా వాటిని ఎదుర్కొంటూనే రాణిస్తున్నారు.

– అజ్మీర రాందాస్, జిల్లా క్రీడల అధికారి

పాతతరమే స్ఫూర్తిగా..



ఎల్లారెడ్డిపేట ఉమ్మడి మండలంలోని పలు పల్లెల్లో విద్యార్థులు, యువకులు పాత తరం ఉద్యోగులనే స్ఫూర్తిగా తీసుకొని ఉన్నత చదువులపై దృష్టి పెడుతున్నారు. దుమాలలో పదేళ్ల క్రితం ఎంప్లాయిస్ అసోసియేషన్ ఏర్పాటు చేసి విద్యార్థులకు, క్రీడాకారులకు ప్రోత్సాహం అందిస్తున్నాం. నేటి యువతలో బాగా చదువుకొని ఉన్నత స్థానాల్లో స్థిరపడాలనే పట్టుదల కనిపిస్తుంది.

– కదిరె శ్రీనివాస్, ఉపాధ్యాయుడు

అల్ఫోర్స్‌లో రామానామ జపం



సీతారాముల వేషధారణలో చిన్నారులు

కరీంనగర్‌కల్చరల్/రామడుగు: అయోధ్యలో శ్రీరాముని విగ్రహ ప్రాణప్రతిష్ఠ సందర్భంగా శనివారం కరీంనగర్, రామడుగు మండలం గోపాల్‌రావుపేట అల్ఫోర్స్ విద్యాసంస్థల ఆధ్వర్యంలో రామానామ జపం నిర్వహించారు. వావిలాలపల్లిలోని అల్ఫోర్స్ స్కూల్ ఆఫ్ జెన్నెక్ట్ మైదానం నుంచి ర్యాలీ నిర్వహించారు. అల్ఫోర్స్ అధినేత నరేందర్‌రెడ్డి మాట్లాడారు. ఈ సందర్భంగా విద్యార్థులు వేసిన రామ, లక్ష్మణ, సీతమ్మ, హనుమాన్ వేషధారణలు ఆకట్టుకున్నాయి.

సాక్షి క్లాసిఫైడ్స్

SERVICES
BUSINESS OFFER

■ ద్వారకాఎంటర్‌ప్రైజెస్‌పేపర్‌ప్లేట్స్ & LEDమిషన్స్‌పై ప్రతి నెల అధిక ఆదాయం, అద్భుత అవకాశం, ఉచిత ముడి పదార్థాలు, 100% తిరిగి కొనుగోలు ఒప్పందం. 9310515624, 8800496710 [G-1427]

■ 18–28 సం॥ల యువతి యువకులకు,RS 49 K స్వల్ప పెట్టుబడిలోకల్‌ఫ్రాంచైజీతో పర్మినెంట్‌బిజినెస్ ఆదాయం. మల్టీ సర్వీసెస్+ట్రైనింగ్+డైలీ సపోర్ట్@15 సం॥ల నమ్మకమైన సర్టిఫైడ్ సంస్థ WWI-Hyd. Ph: 9908743603 [HA-2583]

■ "కరీంనగర్ జిల్లా ప్రజలకు శుభవార్త" ఇప్పుడు చిన్న పెట్టుబడితో Bussiness చేసి 1,80,000 రూపాయలు సంపాదించు కునే గొప్ప సువర్ణవకాశం, 100% Decentralization, Block Chain సంప్రదించండి. ఫోన్: 919440021305, 919866962459 [H-788194]

WANTED

■ ప్రతి డోర్ టు డోర్ సర్వే చేయడానికి స్త్రీ/పు వెంటనే కావలెను. జగిత్యాల జిల్లా సంప్రదించండి. సెల్: 9493510553, 9440519046 [K-1185962]

■ ప్రముఖ కంపెనీలో పార్ట్ టైం మాన్యువల్ రైటింగ్ వర్క్ చేయుటకు స్త్రీ/పురుషులు కావలెను. వీక్లీ పేమెంట్. మీ పేరు, అడ్రస్ కాల్/వాట్సప్ చేయగలరు. 91777 36926. [M-1233752]

■ మీ ఇంటి వద్దనే వుండి మీ మొబైల్ ద్వారా మా కంపెనీ యొక్క Message పంపుతూ వారానికి 3500/- సంపాదించుకోండి. వాట్సాప్ చేయండి. సంప్ర. 9573633520, 9059633520. [M-1167505]

www.sakshi.com

■ విజయవాడలో A/C & Coolers రెంటల్ (towerac.com) కంపెనీకి A/C టెక్నీషియన్స్-3, దోస్త్ డ్రైవర్లు-3, హెల్పర్లు-5, 30సం.లోపు జీ:18 - 25,000 ట్రైనింగ్ / భోజనం / వసతి ఫ్రీ. ✆ 91771 77244 [B-1255218]

■ ఇంటి వద్దనే వుంటూ మీరు నచ్చిన టైంలో Job చేయుటకు Inter ఆపైన చదివిన Male/Female వారు కావలెను. శాలరీ 15000/- బయోడేటాతో ఇంటర్వ్యూకు హాజరుకాగలరు. 88869 77782. [M-1167509]

■ రామకృష్ణ గ్రూప్ (A.P&న్యూఢిల్లీ No.1) శ్రీమంతుల ఇండ్లలో వృద్ధుల/పేషెంట్ల సేవకు వంట/ఇంటి పని, బేబీకేర్‌కైMFవర్కర్లు కా.భో+వ+జీతం 15-21 వేలు. ఏజెంట్లకమీషన్‌ఇవ్వబడును.9052671122/9133271122 [H-787758]

■ వనివారు కావలెను. హైదరాబాద్, బెంగళూరులో ఉండి ఇంటిపని, వంటపని, వృద్ధుల సేవ, పిల్లల పోషణకు స్త్రీలు, కావలెను. సంప్ర॥ 9391912949, 040-40123376. [H-801571]

■ త్రివేణి హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్/నర్సులు కావలెను. ఫ్రీ వసతి + భోజనం. జీ: 18K. ఫోన్: 9160900024/ 9640400073 [H-793681]

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

For Classifieds, Advertisements Contact:
9951602933, 9951602824